సాక్షి
మంచిర్యాల

సోమవారం । 19 । ఆగస్టు । 2024



'స్వచ్ఛత'పై పట్టింపేది..?

బెల్లంపల్లి మున్సిపాలిటీలో పరిసరాల పరిశుభ్రత కానరావడం లేదు. పూడిక నిండిన కాలువలు, నీటి మడుగులు బస్తీల్లో ఇబ్బడి ముబ్బడిగా ఉన్నాయి. 9లో▸



బాసరకు పోటెత్తిన భక్తజనం

బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం చతుర్దశి పురస్కరించుకుని భక్తులతో ఆలయం కిటకిటలాడింది. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.4 /26.3

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఉక్కపోత అధికంగా ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు కేంద్ర మంత్రి 'బండి' రాక

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పడ్తనపల్లి గ్రామంలోని రాంపూర్ శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయం పూర్వ విద్యార్థి, కేంద్ర మంత్రి బండి సంజయ్ సోమవారం పాఠశాలకు రానున్నారు. శ్రీసరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీకి అనుగుణంగా రాంపూర్ ఆవాస విద్యాలయంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సకల సౌకర్యాలు, సదుపాయాలతో భారతీయ విలువలతో కూడిన విద్యాలయ భవన సముదాయ నిర్మాణ భూమి పూజ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి హనుమత్ దీక్షా పీఠాధిపతి దుర్గాప్రసాద్‌స్వామీజీ, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, సరస్వతీ విద్యా పీఠం అధ్యక్షుడు తక్కళ్లపల్లి తిరుపతి తదితర ప్రముఖులు హాజరు కానున్నారు.

సత్యదేవున్ని దర్శించుకున్న రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్



సత్యదేవున్ని దర్శించుకుంటున్న తిరుపతి

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామిని, రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ కొట్నాక తిరుపతి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం సత్యదేవున్ని దర్శించుకుని పూజలు చేశారు. ఈసందర్భంగా అర్చకులు ఆయనను ఆశీర్వదించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇద్దరు బీట్ అధికారుల సస్పెన్షన్

జన్నారం: జన్నారం అటవీ డివిజన్, తాళ్లపేట్ రేంజ్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు బీట్ అధికారులను సస్పెండ్ చేస్తూ జిల్లా అటవీశాఖ అధికారి(డీఎఫ్‌వో) శివ్ ఆశిష్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారని తాళ్లపేట్ రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. విధుల్లో , అటవీ రక్షణలో నిర్లక్ష్యం వహించారనే అభియోగంపై తానిమడుగు బీట్ అధికారి సాగర్, దండెపల్లి బీట్ అధికారి అనిల్‌ను సస్పెండ్ చేస్తూ డీఎఫ్‌వో ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పర్యవేక్షణ అధికారుల పోస్టులు భర్తీ చేయాలి

- ఎస్సీ, ఎస్టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న



సమావేశంలో మాట్లాడుతున్న రాజన్న

జన్నారం: రెండు దశాబ్దాలుగా పర్యవేక్షణ అధికారుల పోస్టులు భర్తీ కాక రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, వెంటనే ఉప విద్యాధికారి, మండల విద్యాధికారులు, డైట్, బీఈడీ కళాశాల అధ్యాపకుల పోస్టులు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న ప్రభుత్వాన్ని కోరారు. జన్నారం మండల కేంద్రంలో ఆదివారం మాట్లాడారు. పదోన్నతులలో సీనియారిటీ, పోస్టింగ్, రోస్టర్ పాయింట్లలో నష్టం జరిగిన ఉపాధ్యాయుల అప్పీళ్లను పరిష్కరించాలన్నారు. ప్రతీ మండలంలో నర్సరీ నుంచి పదో తరగతి ఉండేలా అన్ని వసతులతో కూడిన ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు చేయాలని, బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ టీఎఫ్ మండల అధ్యక్షుడు తుంగూరు గోపాల్, నాయకులు కామెర శంకర్, వెంకటరాజం తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యల పరిష్కారానికి పాదయాత్ర



దర్మ్మకు స్వాగతం పలుకుతున్న ఆదివాసీ నాయకులు

మంచిర్యాలటౌన్: ఆదివాసీల సమస్యల పరిష్కారానికి తిర్యాణి నుంచి హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం వరకు పెందోర్ దర్మ్మ చేపట్టిన మహా పాదయాత్ర మూడో రోజు ఆదివారం మంచిర్యాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయనకు ఆదివాసీ వర్ధాన్ సంఘం జిల్లా తరఫున మడావి శంకర్ స్వాగతం పలికారు. రూ.5 వేల నగదు సహాయం చేశారు.

జిల్లాకు జరమొచ్చింది



తాండూరు మండలంలో ఇంటింటి జ్వర సర్వే చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

జిల్లాలోని గృహాలు	1,00,157
జిల్లా జనాభా	3,02,646
గుర్తించిన జ్వర బాధితులు	2,026
డెంగీ కేసులు	53
మలేరియా అనుమానితులు	05

- ఇంటింటి సర్వేలో వెలుగు చూస్తున్న వ్యాధులు
- మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికున్‌గన్యా కేసుల గుర్తింపు
- మందులు ఇచ్చి, నివారణ చర్యలు చేపడుతున్న వైద్య ఆరోగ్యశాఖ

మంచిర్యాలటౌన్: జిల్లాలో సీజనల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. జిల్లా వైద్యఆరోగ్య శాఖ చేపట్టిన ఇంటింటి సర్వేలో జ్వర బాధితులు పెరుగుతున్నారు. వీటిలో వైరల్ జ్వరాలతోపాటు, డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గన్యా కేసులు నమోదవుతుండడంతో ఆందోళన కలిగిస్తోంది. విషజ్వరాలతో బాధపడుతున్నవారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేసి వైద్యం అందిస్తున్నారు. సాధారణ జ్వర బాధితులకు వద్దే మందులు ఇస్తున్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు, జ్వరాలు ఎక్కువగా ఉన్న ఇళ్లలో దోమల నివారణ మందు పిచికారీ చేసి, మున్ముందు సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు జ్వర బాధితులతో కిటకిటలాడుతున్నాయి. విషజ్వరాలు ప్రబలుతుండడంతో జ్వర సర్వేను మరింత వేగవంతం చేశారు. ప్రతీ ఇంటికి వెళ్లి, ఆ ఇంట్లో ఎవరెవరు సీజనల్ వ్యాధులకు గురవుతున్నారనే వివరాలను ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది సేకరిస్తున్నా రు. ఆస్పత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండగా, ఇంటింటి సర్వేలోనూ బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. అనుమానితుల నుంచి బ్లడ్ శాంపిళ్లను సేకరించి, టీహబ్ ద్వారా నిర్ధారిస్తున్నారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు టీహబ్‌లోనే పరీక్షలు చేస్తున్నారు.

సగం ఇళ్లు సర్వే..

జిల్లావ్యాప్తంగా ఉన్న 3.02 లక్షల జనాభా ఉంది. జిల్లా వ్యాప్తంగా ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు నెల రోజులుగా ఇంటింటా జ్వర సర్వే చేస్తున్నారు. 1,00,157 ఇళ్లు ఉండగా, దాదాపు సగం ఇళ్లు సర్వే చేశారు. ఇందులో 2,026 మంది జ్వర బాధితులను గుర్తించి, వారికి మందులు అందించారు. సీరియస్‌గా ఉన్న 551 మందిని దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. రాపిడ్ డయాగ్నోసిస్ కిట్స్ ద్వారా మలేరియా టెస్టులను చేస్తుండగా, కొన్ని పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. వాటిని నిర్ధారించుకునేందుకు బ్లడ్ శాంపిళ్లను సేకరించి టీహబ్‌కు పంపిస్తున్నారు. ఇప్పటికీ డెంగీ కేసులు 53 వరకు నమోదు కాగా, మలేరియా అనుమానిత కేసులు 5 ఉన్నట్లుగా గుర్తించారు. టీహబ్ పరీక్షల్లో తేలితే మలేరియాను నిర్ధారించనున్నారు. ప్రధానంగా డెంగీ, మలేరియా లక్షణాలపై ఆరా తీస్తున్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉన్నాయని ప్రజలను అడిగి తెలుసుకుంటున్నారు. జ్వర లక్షణాలు ఉంటే ఎన్ని రోజుల నుంచి వస్తుంది, ఏమైనా మందులు వాడుతున్నారా, వాడినా జ్వరం తగ్గడం లేదానే వివరాలను సేకరిస్తున్నారు. కేవలం జ్వరం బారిన పడిన వారికి ఇంటి వద్దనే మందులు ఇస్తున్నారు. వర్షాలు కురవడం, మధ్యలో ఎండ తీవ్రత పెరుగుతుండడంతో సీజనల్ వ్యాధులు ఎక్కువగా పెరిగే అవకాశం ఉంది. దీంతో సీజనల్ వ్యాధులు పెరగకుండా గ్రామాలు, పట్టణాల్లో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల సహాయంతో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నారు.

ఇంటింటి సర్వేతో గుర్తింపు..



జిల్లాలో సీజనల్ వ్యాధులపై నిర్వహిస్తున్న ఇంటింటి జ్వర సర్వేతో ఏ ఇంట్లో జ్వర బాధితులతోపాటు, ఇతర వ్యాధుల బారినపడ్డవారు ఎంత మంది ఉన్నారనే వాటిని గుర్తిస్తున్నాం. జ్వరాలు ఎక్కువగా ఉంటే వారిని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నాం. అవసరమైన వారికి ఇంటి వద్దనే మందులు ఇవ్వడం తోపాటు, అనుమానితుల నుంచి రక్త నమూనాలను సేకరించి, టీహబ్‌కు పరీక్షల నిమిత్తం పంపిస్తున్నాం.

– డాక్టర్ హరీశ్‌రాజ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

'పల్లె' పోరుకు సిద్ధం..!



జిల్లా పరిషత్ కార్యాలయం, మంచిర్యాల(ఫైల్)

- గ్రామాల్లో ఆరు నెలలుగా ప్రత్యేక పాలన
- ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం సంకేతాలు
- జిల్లాకు చేరిన మార్గదర్శక కరదీపికలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. ఇప్పుడు పల్లె పోరు ఉంటుందని భావించిన వారికి ఆ ఊసు లేకపోవడంతో నిరాశ మిగిలింది. కానీ, ఇప్పుడు పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వం నుంచి సంకేతాలు రావడంతో పంచాయతీ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 2తో పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగిసింది. దీంతో పాలన ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్లింది. నిబంధనల ప్రకారం ప్రత్యేకాధికారుల పాలన మూడు నెలలకు మించి కొనసాగించాడానికి వీలులేదు. కానీ ఆరు నెలలు దాటడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామాలకు రావాల్సిన గ్రాంట్లు నిలిచిపోయాయి. సీఎం ప్రకటన, ప్రభుత్వ సంకేతాలతో ఇప్పటికే ఓటరు జాబితా సిద్ధం చేసి ఉంచాలని ఆదేశాలు రావడం, ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈ నెల మొదటి వారంలో కొంత మంది సిబ్బంది శిక్షణ ఇచ్చారు. ఎన్నికల శిక్షణ సామగ్రి, ఎన్నికల మార్గదర్శక కరదీపికలు జిల్లాకు చేరాయి.

బ్యాలెట్ బాక్సులు సిద్ధం..

జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. అంతేకాదు ఇందుకు అవసరమైన సామగ్రిలో భాగంగా బ్యాలెట్ బాక్సులు కూడా సిద్ధం చేసుకున్నారు. ఇక్కడ అందుబాటులో ఉన్న బ్యాలెట్ బాక్సులతోపాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కూడా తెప్పించుకున్నారు. ఎన్నికల కమిషన్ నుంచి నోటిఫికేషన్ వచ్చేలోగా జిల్లాలో ఓటరు జాబితా తయారీ, బ్యాలెట్ బ్యాక్సులు సమకూర్చడం, బ్యాలెట్ పేపర్లు, సిబ్బంది నియామకం తదితర ఏర్పాట్లు పూర్తి చేసుకునే ప్రణాళికతో అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంది.

సందడిగా గ్రామాలు..

పంచాయతీ ఎన్నికల ప్రకటన ఎప్పుడైనా వచ్చే అవకాశం ఉండటం, ప్రభుత్వం నుంచి సంకేతాలు రావడంతో గ్రామాల్లో సందడి మొదలైంది. ఆశావహుల్లో కదలిక ఏర్పడి ప్రజల్లోకి వెళ్లేలా కార్యచరణ సిద్ధం చేసుకుంటున్నారు. ఆశావహుల్లో తాజా మాజీ సర్పంచులు, కొత్తవారు, రియల్ వ్యాపారులు ఇలా అంతా ఉన్నారు. సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం కోసం ఎమ్మెల్యేను, మాజీ ఎమ్మెల్యేను ఎవరికి వారు ప్రసన్నం చేసుకునే పనిలో ఉండగా, కొందరు మంత్రుల స్థాయిలోనూ రికమండేషన్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే పంచాయతీ రిజర్వేషన్లపై అయోమయం నెలకొంది. గత ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న పంచాయతీ, ప్రాదేశిక స్థానాల రిజర్వేషన్లు పదేళ్లు వర్తించేలా చట్టం చేసింది. అయితే ఆ చట్టాన్ని రద్దు చేసి రిజర్వేషన్లు మార్పు చేసి ఎన్నికలు నిర్వహిస్తారనే ప్రచారం కూడా ఉంది. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

కుంటుపడుతున్న అభివృద్ధి..

సర్పంచుల పదవీకాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. ప్రత్యేకాధికారులు వారివారి బాధ్యతల్లో బిజీగా ఉండటంతో పాలన గాడితప్పింది. ఇప్పటికే పలుమార్లు పల్లెల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిందని తెలిపినా అధికారుల్లో మార్పు రావడం లేదు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. అయితే ప్రతీ చిన్న పనికి ప్రత్యేకాధికారుల అనుమతి తీసుకుని రావాల్సి వస్తోంది. వారు అందుబాటులో లేని సమయాల్లో కార్యదర్శులు ఇబ్బందులు పడుతూ పంచాయతీల్లోని విధులు ఎలాగోలా నెట్టుకు వస్తున్నారు. పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. రాష్ట్రం నుంచి రావాల్సిన నిధులు కూడా ఏడాదిగా విడుదల కావడం లేదు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయింది. గతంలో తాము సొంత డబ్బులు ఖర్చు చేసి పనులు పూర్తి చేశామని, వాటి బిల్లులు రాక మాజీ సర్పంచులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

సర్పంచులు	ఎంపీటీసీలు	జెడ్పీటీసీలు	ఎంపీపీలు	వార్డు సభ్యులు
311	130	16	16	2,730

ఐకమత్యంతో రాజ్యాధికారం



అభివాదం చేస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీల ఐకమత్యంతోనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని పొలిటికల్ జస్టిస్ చైర్మన్ జీవీఆర్.నారగోని అభిప్రాయపడ్డారు. పట్టణంలోని సాయిమిత్ర గార్డెన్‌లో ఆదివారం బీజీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ రాజకీయ సమన్వయ చర్చావేదిక కార్యక్రమానికి నారగోని ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 80 శాతం జనాభా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను అగ్రకులాల వారు ఓటు బ్యాంకుగా వాడుకుని గద్దెనెక్కుతున్నారని వివరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను చైతన్యపరిచి అధికారంలోకి వస్తేనే భవిష్యత్‌లో అభివృద్ధి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సాగర్, రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వరగౌడ్, ప్రకతాప్‌గౌడ్, సత్యనారాయణ, నరేశ్, రమేశ్, అభిలాష్, అంజనేయులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కత్తి కిరణ్‌కు 'తెలంగాణ ఐకాన్' అవార్డు



నిర్మల్: జిల్లా కేంద్రానికి చెందిన ఫిజియోథెరపిస్ట్ కత్తి కిరణ్ తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ద్వారా ప్రతిష్టాత్మక తెలంగాణ ఐకాన్ పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డు అందజేశారు. సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నందువల్ల కిరణ్‌కు ఈ పురస్కారం దక్కింది.

అనుబంధాల రాఖీ..



నిర్మల్: అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధాలకు ప్రతీక రాఖీ. పోగులతో అల్లుకున్న దారం ఎంత బలంగా ఉంటుందో.. అలాగే ప్రేమ, ఆప్యాయతలతో అంతే దృఢంగా తమ అనుబంధాలు కలిసి ఉండాలని చూపిస్తుంది. అనాదిగా వస్తున్న రక్షాబంధన్ ఉత్సవం అన్నిపండుగల్లో కంటే వినూత్నమైంది. తన అన్నదమ్ముల కోసం అక్కాచెల్లెళ్లు స్వయంగా ఇళ్లకు వచ్చి, రాఖీలు కట్టి వారిని ఆశీర్వదించే తీరు ఇక్కడ ప్రత్యేకం. అలాగే తమ సోదరీమణులకు వీలుకాకపోతే అన్నదమ్ములే వాళ్లింటికి వెళ్లి మరీ రాఖీ కట్టించుకుంటారు. జిల్లా వ్యాప్తంగా నేడు రక్షాబంధన్ ఉత్సవాన్ని ఘనంగా జరుపుకోనున్నారు.

బహుజన బాంధవుడు పాపన్న





సర్వాయి పాపన్నకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: బహుజనుల హక్కుల కోసం పోరాడిన బహుజన బాంధవుడు సర్దార్ సర్వాయి పాపన్న అని, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో సర్వాయి పాపన్న 374వ జయంతిని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న చిత్ర పటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆ రోజుల్లో ఉన్న పరిస్థితులను ఎదుర్కొని బహుజనులకు జరిగిన అన్యాయాన్ని ఎదిరించి న్యాయం చేశారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు బహుజనులకు చేరేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. నేటి యువత ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం జిల్లా నాయకులు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంక్షేమ సహాయ అధికారి భాగ్యవతి, వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం..

జన్నారం: పట్టుదల, సాహసంతో ఎన్నో విజయాలు సాధించిన సర్దార్ సర్వాయి పాపన్న నేటి యువతకు ఆదర్శం అని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం నిర్వహించిన సర్వాయి పాపన్న 374వ జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ధైర్య సాహసాలతో పోరాటం చేసి గోల్కొండ కోటను ఆక్రమించుకున్న మహావీరుడు పాపన్నగౌడ్ అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గౌడ కులస్తుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. గీత కార్మికుల కోసం ఉచితంగా సేఫ్టీ కిట్లు అందిస్తుందని తెలిపారు. గీత కార్మికుల సంక్షేమం కోసం గీత కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. గీత కార్మి కుల సమస్యలు తన సమస్యలుగా భావిస్తానని తెలిపారు. యువకులు పెడదారి పట్టకుండా సర్వాయి పాపన్న స్ఫూర్తితో లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీపీ సరోజన, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజఫర్ అలీఖాన్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, పానకల్‌గౌడ సంఘం అధ్యక్షుడు సతీశ్‌గౌడ్, మోకుదెబ్బ రాష్ట్ర నాయకులు శ్రీనివాసగౌడ్, నర్సాగౌడ్, కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్, శంకరయ్య, బీఆర్‌ఎస్ నాయకుడు పూర్ణనాయక్, వ్యాపారవేత్త పూర్ణచందర్‌రావు, గౌడ సంఘం నాయకులు పోశగౌడ్, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

జాయింట్ సర్వే చేయించండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వినోద్, ప్రజలు

వేమనపల్లి: అటవీ, రెవెన్యూ శాఖల మధ్య వివాదాస్పదంగా ఉన్న భూములపై ఇరు శాఖలతో జాయింట్ సర్వే చేయించి గిరిజనులకు పట్టాలు ఇప్పించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్ కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం ఇచ్చారు. మండలంలోని గొర్లపల్లి గ్రామపంచాయతీలోని కాటేపల్లి, గొర్రెగూడం గ్రామాలకు, చామనపల్లి గ్రామపంచాయతీకి సంబంధించిన గిరిజనులు, గిరిజనేతరులు దశాబ్దాలుగా అటవీ భూమిని సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ భూముల్లో గిరిజనులకు జారీ చేసిన హక్కు పత్రాలకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని తెలిపారు. సమస్యపై స్పందించిన కలెక్టర్ సత్వరమే సమస్య పరిష్కరించి హక్కుపత్రాలు ఉన్న గిరిజనులకు రుణాలు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. రుణాలు ఇవ్వకుండా గిరిజనులను ఇబ్బంది పెడుతున్న బ్యాంకర్లపై చర్య తీసుకుంటామని హెచ్చరించారు. ఇరు శాఖల మధ్య వివాదాస్పదంగా ఉన్న భూముల్లో జాయింట్ సర్వే చేయించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చినవారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్‌అలీ, గ్రామస్తులు ఉన్నారు.

మాజీ సైనిక కుటుంబాలకు ఉచిత వైద్యం



శిబిరంలో మాజీ సైనికుల కుటుంబ సభ్యులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర మాజీ సైనికుల సంక్షేమ శాఖ డైరెక్టర్ కల్నల్ రమేశ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని విజయ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఆదివారం మాజీ సైనిక కుటుంబాలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆదేశాల మేరకు ఈ వైద్య శిబిరాన్ని ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు అన్ని రకాల వైద్య పరీక్షలను చేయించడం జరుగుతుందని పేర్కొన్నారు.

తలసేమియా వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరంను పరిశీలిస్తున్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి

మంచిర్యాలటౌన్: తలసేమియా, సికిల్‌సెల్, సికిల్‌తల్ వ్యాధిగ్రస్తుల కోసం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి తెలిపారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో ఆదివారం హిమోటాలజీ, కంటి, దంత వైద్యులతో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపునకు అమెరికన్ ఆంకాలజీ ఆస్పత్రి హైదరాబాద్ నుంచి సీఎస్ హిమోటోలోజిస్టు డాక్టర్ రంజిత్‌కుమార్ హాజరై వైద్య పరీక్షలను నిర్వహించారు. మంచిర్యాలకు చెందిన శంకర్ నేత్రాలయ వైద్యుడు చిందం అభిషేక్, ఆర్‌ఎస్ డెంటల్ ఆసుపత్రి డాక్టర్ రాజశేఖర్, బ్లడ్ బ్యాంకు వైద్యులు డాక్టర్ ప్రియాంక సక్సేనా ద్వారా 96 మంది వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ మున్ముందు అన్ని రకాల స్పెషలిస్టు వైద్యులను పిలిపించి మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. హెచ్‌బీఎల్‌సీ టెస్టును ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. అనంతరం డాక్టర్ రంజిత్‌కుమార్ మాట్లాడుతూ తలసేమియా వ్యాధిగ్రస్తులకు 9 గ్రాముల హిమోగ్లోబిన్ ఉండేలా చూసుకోవాలన్నారు. వ్యాధి నయం అయ్యేందుకు బోన్‌మారో మార్పిడి ఒక్కటే మార్గమని చెప్పారు. వ్యాధికి సంబంధించిన వ్యాక్సినేషన్ తప్పకుండా వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, సెక్రెటరీ చందూరి మహేందర్, వి.మధుసూదన్‌రెడ్డి, కాసర్ల శ్రీనివాస్, చెంచు శంకర్‌వర్మ, ఎడ్ల కిషన్, ఉదారి చంద్రమోహన్‌గౌడ్, కాసర్ల రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుక్కలదాడిలో చుక్కల దుప్పి మృతి



చుక్కల దుప్పి కళేబరం

వేమనపల్లి: ముత్తాపూర్ అటవీ బీట్ పరిధి జిల్లెడ శివారులో ఆదివారం చుక్కల దుప్పి కుక్కలదాడిలో మృతిచెందింది. జిల్లెడ సమీపంలో నీలగిరి తోట పక్కన ఉన్న పత్తి చేలలోకి మేసేందుకు దుప్పి వచ్చింది. కుక్కల వెంబడించి తరమడటంతో ఊరి వైపు పరుగులు తీసింది. తొడ, మెడ వద్ద తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు కుశ్నపల్లి రేంజ్ అధికారి దయాకర్‌కు సమాచారం అందించారు. ఎఫ్ఎస్ఓ రాందాస్, ఎఫ్‌బీఓ శంకర్‌కు ఘటన స్థలానికి వెళ్లారు. పశువైద్యాధికారి పవన్‌కుమార్ సిబ్బందితో వెళ్లేసరికి దుప్పి మృతి చెందింది. పంచనామా నిర్వహించి నీలగిరి తోట సమీపంలో కళేబరాన్ని పూడ్చిపెట్టారు.

పిడుగుపడి రైతు మృతి



సిడాం శ్రీనివాస్ మృతదేహం

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామానికి చెందిన సిడాం శ్రీనివాస్ (45) పిడుగుపాటుకు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. శ్రీనివాస్.. గ్రామసమీపంలో రెండు ఎకరాలు కౌలు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం కూలీలు, కుటుంబ సభ్యులతో కలసి వరినాట్లు వేస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. బయటికి వస్తున్న క్రమంలో పిడుగుపాటుకు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై కొమురయ్య పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య కాంతబాయి, కుమారుడుదేవాజీ, కుమార్తె అఖిల ఉన్నారు.

షెడ్డులో అగ్నిప్రమాదం



కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని విద్యుత్ శాఖ డీఈ కార్యాలయ ఆవరణలోని ఎలక్ట్రికల్ పవర్ హౌజ్‌లో గల ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేసే షెడ్డు (ఎంఆర్‌టీ)లో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో అధికారులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకునే లోపు కాలనీవాసులు మంటలార్పివేశారు.

అమెరికా నుంచి వచ్చి..



నేను మంచిర్యాల నుంచి పెళ్లి తర్వాత ఉద్యోగరిత్యా భర్తతో అమెరికా వెళ్లాను. తమ్ముడు దినేష్‌కు రెండేళ్లుగా నేరుగా రాఖీ కట్టలేదు. పండుగలోపు రాఖీని కొని పంపించేదాన్ని. ఈ ఏడాది ఎలాగైనా రాఖీ కట్టాలని మంచిర్యాలకు వచ్చాను. తమ్ముడికి రాఖీ కట్టేందుకు ఎదురుచూస్తున్నాను.

– చిటుమల్ల దివ్య, కాలిఫోర్నియా, అమెరికా

అన్నయ్యపై ప్రేమతో వస్తున్నా



బెల్లంపల్లి: మాది నెన్నెల మండలం గొల్లపల్లి స్వగ్రామం. నాకు పెళ్లై 9 ఏళ్లు కావస్తోంది. భర్త సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ప్రస్తుతం హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నారు. ఏటా రాఖీ పండుగకు నేను ఎక్కడున్నా సోదరుడు రమేశ్ వద్దకు వచ్చి రాఖీ కట్టడం నాకెంతో ఇష్టం. తోబుట్టువుపై ఉన్న ప్రేమతో పండుగకు ఒకరోజు ముందుగా ఇంటికి వచ్చాను.

– గంధ్ర సుమలత, హైదరాబాద్

తమ్ముడికి రాఖీ కట్టడానికి వచ్చాను



తమ్ముడికి రాఖీ కట్టడం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. ప్రస్తుతం నేను హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాను. ప్రత్యేకంగా సెలవు తీసుకుని నెన్నెలలో ఇంటికి వచ్చాను. తమ్ముడికి రాఖీ కట్టి పండుగ జరుపుకుంటాం.– చిన్నోజు నిహారిక, నెన్నెల

పండుగకు ఇంటికొస్తా



ప్రస్తుతం నేను వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. ఇద్దరు అన్నలు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నారు. రాఖీ పండుగ రోజు ఇంటికి వచ్చి పండుగ జరుపుకోవడంలో ఉన్న తృప్తి వెలకట్టలేనిది. – గొల్ల శిరీష, వరంగల్, మాదారం

రక్షా'బంధం'



- అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక
- నేడు రాఖీపౌర్ణమి

ఏటా శ్రావణమాసంలో వచ్చేపౌర్ణమి తిథి రోజు రాఖీ జరుపుకుంటారు. శాస్త్రప్రకారం భద్రకాలం ముగిసిన తర్వాత రాఖీ కట్టాలి. ఈ తిథుల విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమి తిథి సోమవారం తెల్లవారుజాము 3:04 గంటలకు ప్రారంభమై రాత్రి 11:55కు ముగుస్తుంది. అయితే ఆ మధ్యలో భద్రకాలం ఉదయం 5:53 నుంచి మధ్యాహ్నం 1:32 గంటల వరకు సోదరులకు రాఖీ కట్టకూడదని పండితులు చెబుతున్నారు. మిగిలిన సమయంలో రాఖీలు కట్టవచ్చని పేర్కొంటున్నారు.

కెరమెరి(ఆసిఫాబాద్): 'అన్నయ్య సన్నిధి అదే నాకు పెన్నిధి..కనిపించే దైవమే ఆ కనులలో సన్నిధి'అని ఓ చెల్లి తన సోదరుడి గురించి పాట పాడడంలో ఎంతో అర్థం ఉంది. తనను ప్రాణం కంటే మిన్నగా ప్రేమించే అన్నయ్యలంటే ప్రతీ చెల్లికి అభిమానమే. సోదరీసోదరుల ఆత్మీయతకు అద్దం పట్టేదే రక్షా'బంధనం'. ఇంటి ఆడపడుచు మహాలక్ష్మి స్వరూపంగా, పరాశక్తికి ప్రతీకగా భావించే సంస్కృతి మనది. కష్టసుఖాల్లో మేము మీకు అండగా ఉన్నామన్న భరోసాను సోదరులు అక్కా చెల్లెళ్లకు కల్పించడమే రాఖీ బంధం. అన్నాచెల్లెళ్ల ఆత్మీయ చిహ్నానికి, వారి మధ్య అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమిని నేడు ఉమ్మడి జిల్లాలో ఘనంగా జరుపుకోనున్నారు. అక్కాచెల్లెళ్లు సోదరులకు రాఖీలు కట్టి మిఠాయి తినిపిస్తారు. తర్వాత వారు కానుకలు ఇస్తారు. ఇది వారి ప్రేమ, అనురాగానికి వారధిగా నిలుస్తుంది. సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు ఆత్మీయులకు పోస్టు ద్వారా లేదా ఇతర మార్గాల ద్వారా రాఖీలను పంపారు. భారతీయ ధర్మశాస్త్రాల్లో తెలిపిన రక్షాబంధన్ రోజున సోదరునికి తిలకధారణ గావించి అక్షింతలతో ఆశీర్వదించి రక్షణ కవచాన్ని కడుతుంది. ఇది దేవతారక్షగా కాపాడుతుందని వారి నమ్మకం.

దేవతల కాలం నుంచి..

శ్రీరామునికి కౌసల్య రాఖీ కట్టిందని, రాక్షసుడు విష్ణు భక్తుడైన బలికి మహాలక్ష్మి రాఖీ కట్టి మృత్యువు నుంచి కాపాడిందని, శకుంతల తన గారాల కొడుకు భరతునికి శత్రుభయం లేకుండా తాయిత్తు కట్టిందని కథలు ఉన్నాయి. దేవేంద్రుడు సకల రాక్షసుల మధ్య 12 ఏళ్లు మహాయుద్ధం జరిగింది. ఈ సందర్భంలో రాక్షస రాజు ముల్లోకాలను జయించాడు. పరిస్థితిని గుర్తించిన బృహస్పతి ఇంద్రునికి విజయం కలగాలని ఇంద్రాణితో రక్ష కట్టించాడు. ఇది శ్రావణపౌర్ణమి రోజు వేద పండితుల మంత్రోచ్చారణలో జరిగిందని పురాణాలు చెబుతున్నాయి.

రాజుల కాలం నుంచి..

రాజుల కాలం నుంచి రక్షాబంధం గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. అలెగ్జాండర్ ప్రేయసి రుక్సానా పురుషోత్తమునికి రక్షా సూత్రం కట్టినందుకే అతన్ని విడిచిపెట్టాడు. హుమాయూన్ చక్రవర్తి రాణి కర్ణావతి రాఖీ పంపించి అతడి రక్షా పొందింది. ఛత్రపతి శివాజీ భవానిదేవి ప్రసాదించిన ఖడ్గాన్ని పొంది వేద ధర్మరక్షణలకు ప్రతిన చేస్తూ రక్షా ధరించారనే కథలు ప్రచారంలో ఉన్నాయి. శ్రావణపౌర్ణమిన రాఖీ కట్టడం వల్ల తల్లీబిడ్డకు, భార్యభర్తలకు తొలి దశ ఏర్పడింది. మలిదశలో సోదరీ సోదరునికి రక్షా కట్టడం జరిగింది. ఈ కాలంలో ప్రతీ మహిళా తనకు పరిచయం ఉన్న పురుషునికి సోదరభావంతో రాఖీ కట్టడం, రాఖీ పంపడం, రాఖీని అందుకున్న పురుషుడు ఆమెను సోదరిగా బహుమతులివ్వడం ఆనవాయితీగా వస్తోంది.

విడదీయని బంధం



ఆసిఫాబాద్అర్బన్: రాఖీ పండుగ సోదర భావాన్ని గుర్తుచేస్తుంది. అన్నాచెల్లెళ్లు, అక్కల బంధం జీవితంలో విడదీయరానిది. ప్రతిఏటా మహారాష్ట్రలోని పుణెలో ఉన్న మా సోదరులకు రాఖీ కడుతాను. అదేవిధంగా అక్కాచెల్లెలు లేనివారికి రాఖీ కట్టడం ఎంతో తృప్తినిస్తుంది.

– సిద్దెంశెట్టి సుహాసిని, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యురాలు

అన్నాదమ్ములంటే ఓ భరోసా



అమ్మలోని మొదటి అక్షరం..నాన్నలోని రెండవ అక్షరం కలిపితే ఏర్పడేది అన్నయ్య. నేను పోలీసుశాఖలో పనిచేస్తున్నా. కాగజ్‌నగర్‌లో ఉంటున్న తన అన్నయ్యకు రాఖీ కట్టడం ధైర్యాన్నిస్తుంది. రాఖీ పండుగ సంతోషాన్ని మాటల్లో చెప్పలేను. – సునీత, షీటీం హెడ్ కానిస్టేబుల్, ఆసిఫాబాద్

పండగంటే ఇష్టం

ప్రతిఏటా ఆసిఫాబాద్‌లో ఉంటున్న అమ్మానాన్నల సమక్షంలో రాఖీ పండుగను చేసుకుంటాం. అమ్మ చేతి వంటలను ఆస్వాదిస్తాం. అన్నయ్యకు రాఖీ కట్టడంతో మంచి జరుగుతుందని ఎంతో నమ్మకం. నాన్న రంగుల రాఖీలు తీసుకువస్తాడు. ఈ పండుగ అంటే ఇష్టం. – తాటిపల్లి ఈశ్వర్, శ్రేష్ఠ, అన్నాచెల్లెలు, వరంగల్

ఎన్ని పనులున్నా వెళ్తా..

మా ఊరు చెన్నూర్. వివాహం తర్వాత హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాం. ఎన్ని పనులు ఉన్నా సొంత ఊరికి వెళ్తాను. అన్నయ్యకు రాఖీ కట్టి అతను ఇచ్చే కానుకలను భద్రంగా దాచుకుంటాను. స్నేహితులు, బంధువులకు చూపించి సంతోషిస్తాను.

– అభిలాష్‌కు రాఖీ కడుతున్న చెల్లెలు స్వప్న

ఉద్యోగానికి లీవ్ పెట్టి

వృత్తిరీత్యా కరీంనగర్. హైదరాబాద్‌లో ఉంటాం. రాఖీ పండుగ వస్తే కరీంనగర్‌లో ఉన్న చెల్లి బుగ్గారపు హర్షిని వద్దకు వెళ్లి రాఖీ కట్టుకుంటాం. ఎంత పని ఉన్నా లీవ్ పెట్టి అక్కడకు వెళ్తాను. రాఖీ పండుగకు తీసిన ఫొటోలను భద్రంగా దాచుకుంటాను.

– హర్షిని, సంగనబట్ల రేవంత్, భరత్‌కుమార్

అన్నయ్య అంటే ఇష్టం



మంచిర్యాలటౌన్: మా అన్నయ్య సాయికృష్ణ గౌడ్ అంటే చాలా ఇష్టం. ఉద్యోగ రీత్యా అన్నయ్య ఓ చోట, నేను హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నా. నేను, అన్నయ్య మంచిర్యాలకు వచ్చాం. పండుగ రోజున అన్నయ్య రాఖీ కడుతాను.

– బొడిగె దీప్తిగౌడ్, బీటెక్ థర్డియర్, మంచిర్యాల

ఎక్కడున్నా తమ్మునికి రాఖీ కట్టుడే



హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నా. చిన్ననాటి నుంచి తమ్ముడు శ్రీచరణ్‌కు రాఖీ కడుతున్నాను. చదువు పూర్తయి, ఉద్యోగంలో చేరినా పండుగకు ఇంటికి వచ్చి, తమ్మునికి రాఖీ కడుతుంటాను. సెలవులు రావడంతో రెండు రోజులు ముందుగానే మంచిర్యాలకు వచ్చాను. – చిలువేరు శ్రీనిజ, మంచిర్యాల

రాఖీ కట్టి యూఎస్ వెళ్లి..



నేనే ఈ ఏడాది బీటెక్ పూర్తిచేశాను. ఎంఎస్ చేసేందుకు అమెరికా వెళ్లాల్సి వచ్చింది. రెండురోజుల ముందే తమ్ముడు చరిత్‌కు రాఖీ కట్టాను. ఈ ఏడాది మాత్రం రాఖీని రెండురోజుల ముందే కట్టి వెళ్లాను.

– ముత్యాల సంహిత, మంచిర్యాల

సంతానం కలగడం లేదని ఆత్మహత్య



గురువయ్య మృతదేహం

బెల్లంపల్లిరూరల్: సంతానం కలగడం లేదని భర్త (తలలో పేల నివారణకు వాడే మందు) తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్ రమేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని బుధాకుర్దు పంచాయతీ కాశిరెడ్డిపల్లెకి చెందిన పత్రి గురువయ్య (40) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 20 ఏళ్ల క్రితం వెంకమ్మతో వివాహం కాగా, సంతానం కలుగలేదు. సంతానం కోసం భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈక్రమంలో ఆదివారం గొడవపడగా భార్యను కొట్టగా కుటుంబీకులు ఆమెను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమెను ఎందుకు కొట్టావని గురువయ్యని కుటుంబీకులు అడిగారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భార్యను చూసి ఇంటికి వచ్చాడు. మనస్తాపం చెంది పేల మందు తీసుకుని గ్రామశివారులోని మండువా వద్దకు వెళ్లి తాగాడు. భార్యను కొట్టిన నేను బతుకను, పేల మందు తాగానని కుటుంబీకులకు ఫోన్ చేసి చెప్పాడు. వారు అక్కడికి చేరుకుని అతన్ని మంచిర్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. గురువయ్య గతంలో ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందుతాగి మహిళ ఆత్మహత్య



చంద్రక్క (ఫైల్)

దహెగాం: మండలంలోని చిన్నఐనం గ్రామానికి చెందిన జంగిటి చంద్రక్క (50) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఏఎస్సై రమేశ్ కథనం ప్రకారం.. జంగిటి చంద్రక్క గత 9 ఏళ్ల నుంచి మతిస్థిమితం కోల్పోయింది. ఇటీవల హైదరాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. అయినా తగ్గకపోవడంతో శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబీకులు వచ్చి చూడగా ఆమె వద్ద పురుగుల మందు వాసన రావడంతో చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు పంపించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందిందని పేర్కొన్నారు. కుమారుడు మల్లేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డి తెలిపారు. ఆదివారం ఆర్కే 5 గని ఉద్యోగులకు కృష్ణాకాలనీలోని శాంతి మైదానంలో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ పోటీలను జీఎం ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగుల మధ్య ఇలాంటి పోటీలతో స్నేహసంబంధాలు పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో ఓసీపీ పీవో టి.శ్రీనివాస్, ఆర్కే 5 గని మేనేజర్ అబ్దుల్ ఖాదీర్, ఏరియా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఏటీఎం ఎయిర్ కంప్రెషర్‌లో మంటలు



మంటలార్పుతున్న స్థానికులు

తాండూర్: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం వద్ద ఆదివారం స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. ఏటీఎంకు అమర్చిన ఏసీ కంప్రెషర్‌లో నుంచి మంటలు వచ్చాయి. గమనించిన స్థానికులు వెంటనే నీళ్లు చల్లడంతో మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో ప్రమాదం తప్పింది.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన కారు



దెబ్బతిన్న కారు

తాండూర్: మండలంలోని గోపాల్‌నగర్ వద్ద ఆదివారం ఆదుపుతప్పి ఓ కారు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టింది. ఎస్సై కిరణ్‌కుమార్ కథనం ప్రకారం..రేపల్లెవాడ గ్రామానికి చెందిన గునిగంటి దేవానంద్ అచ్చులాపూర్‌కు కారులో వెళ్లాడు. తిరిగివస్తుండగా గోపాల్‌నగర్ మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ఘటనలో కారు డ్రైవర్ దేవానంద్‌కు స్వల్పగాయాలు కాగా, మరో వ్యక్తి నవీన్ సురక్షితంగా బయటపడ్డాడు. గాయపడిన దేవానంద్‌ను బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. ఈ ఘటనలో కారు ముందు భాగం దెబ్బతింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కనువిందు చేస్తున్న రాఖీ పుష్పాలు



బుద్ధిపల్లిలో రాఖీ పుష్పాలు



గొల్లవాడలో రాఖీ పుష్పం

రాఖీ పుష్పాలు కనువిందు చేస్తున్నాయి. మంచిర్యాల జిల్లా బుద్ధిపల్లి పంచాయతీ పరిధిలోని కొండాపూర్‌కు చెందిన పయ్యావుల రాజేశం, నెన్నెలలోని గొల్లవాడలో దూపం చందు, స్వాతి మొండి, తోట ఆశన్న ఇళ్ల ముందు ఉన్న చెట్లకు రాఖీ పుష్పాలు వికసించాయి. వీటిని పంచపాండవుల పుష్పాలు అని అంటారని స్థానికులు తెలిపారు. ఈ పుష్పం చుట్టూ నీలిరంగు రేకులు 101 ఉండగా మధ్యలో తెల్లటి వర్ణంలో ఉండే కేశనాలికలు ఐదు ఉన్నాయి. దీంతో ప్రజలు వాటిని దైవపుష్పాలుగా భావిస్తారని పెద్దలు అంటున్నారు. – మంచిర్యాలరూరల్(హాజీపూర్)/నెన్నెల

అ'పూర్వ' సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: గర్మిళ్ల ప్రభుత్వ హైస్కూల్‌లో 2003–04 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు పీవీఎన్ చారి, వెంకటేశ్వర్లు, రాజగోపాల్, వామనమూర్తి, భీంరావు, శ్రీనివాస్, మధుకర్‌లను సన్మానించారు. కార్యక్రమ నిర్వాహకులు రవి, అశోక్, భీంరావు, సతీశ్, సంధ్యారాణి, సరిత, మనోజ్, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

'రుణమాఫీ' విషయంలో గొడవ

బెజ్జూర్: రుణమాఫీ విషయంలో కుటుంబీకుల మధ్య జరిగిన గొడవలో ఇద్దరికి గాయాలయ్యాయి.. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని లంబడిగూడ గ్రామానికి చెందిన సపావత్ భరి నాయక్‌కు నలుగురు కుమారులు ఉన్నారు. ఒక కుమారుడు మృతి చెందగా, సంతోష్, మహేష్ ఇద్దరు తండ్రి వద్ద ఉంటున్నారు. మరో కుమారుడు విలాస్ భార్యతో వేరుగా ఉంటున్నాడు. భరి నాయక్ పేరిట భూమి ఉంది. బెజ్జూర్ బ్యాంకులో రుణం తీసుకున్నాడు. రుణమాఫీలో వాటా ఇవ్వాలని విలాస్ శనివారం రాత్రి తండ్రిని అడిగాడు. ఇంకా కాలేదని తెలపడంతో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. విలాస్‌తోపాటు భార్య శారదకు గాయాలయ్యాయి. వారిని కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విలాస్ భార్య శారద ఫిర్యాదుతో తండ్రి, ఇద్దరు కుమారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

జ్ఞాపకాలు పదిలం..

ఒక్క ఫొటో ఎన్నో మధుర జ్ఞాపకాలు కదలాడుతాయి. కాలం గిర్రున తిరుగుతున్నప్పటికీ చిత్రం చూడగానే గత స్మృతులు మనసులో మెదలుతాయి. కాలానుగుణంగా ప్రకృతిలో చోటు చేసుకునే మార్పులు బంధించి పదిలంగా దాచుకొని మళ్లీమళ్లీ చూసుకునే అవకాశం. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్, నిర్మల్ సాక్షి ఫొటోగ్రాఫర్లు తీసిన చిత్రాలు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ ఆదిలాబాద్/నిర్మల్



ఒంపుసొంపుల జాతీయ రహదారి..దేవాపూర్ చెక్‌పోస్టు ప్రాంతంలో..



మహబూబ్ ఘాట్ రోడ్డు ఏరియల్ వ్యూ



ఆదిలాబాద్ జిల్లా సలాయిగూడలో ఆదివాసీల జీవన చిత్రం